క్లుప్తంగా

ఘనంగా సత్యదేవుని గ్రామోత్సవం



అన్నవరం వరదయ్యగారి వీధిలో సత్యదేవుని ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అన్నవరంలో శనివారం సత్యదేవుని గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు, ఇండియన్‌బ్యాంక్ వెనుక వరదయ్య వీధి, వెలంపేట ప్రాంతాల్లో స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ప్రత్తిపాడు రూరల్: క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఆ పార్టీ మండలాధ్యక్షుడు గున్నా బత్తుల రాజబాబు తెలిపారు. మండలంలోని ఒమ్మంగి, లంపకలోవ, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో శక్తికేంద్ర ఇంచార్జి సూరవరపు శ్రీను, ధాకే కృష్ణారావు, కందా వీరాస్వామి, యింటి వీరనాగేశ్వరరావు, కూరాకుల రాజా పాల్గొన్నారు.

క్యాలెండర్ల పంపిణీ



పెద్దనాపల్లిలో క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: సంక్రాంతిని పురస్కరించుని మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా తయారు చేయించిన క్యాలెండర్లను పెద్దనాపల్లి, యర్రవరం తదితర గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేశారు.

కోడి పందేలాడుతున్న 12 మంది అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి, రామవరం, జె.కొత్తూరు, రాజపూడి గ్రామాల్లోని కోడి పందేల శిబిరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలాడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు.

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట, రామయ్యపాలెం గ్రామాల్లో కోడి పందాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పెద్దాపురం కోర్టుకు తరలించినట్టుట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు.

భోగి మంటలో జీఓ కాపీలు

ప్రత్తిపాడు: స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల రాజా ఆధ్వర్యంలో భోగి పండగ నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు భోగి మంట చుట్టూ చేరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీఓ నంబర్–1 కాపీలను భోగి మంటలో వేసి నిరసన తెలిపారు.

ముస్లింలు అంటే చంద్రబాబుకు అలుసు



జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా

తుని: టీడీపీ అధినేత చంద్రబాబుకు ముస్లింలంటే చిన్న చూపు అని జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా అన్నారు. తునిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముస్లింల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ముస్లింలు అంటే చంద్రబాబుకు కపట ప్రేమని, చంద్రబాబు కుప్పం పర్యటనలో ముస్లిం నేత గాజుల ఖాదర్ బాషాను అవమానించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఉపముఖ్యమంత్రి పదవి, పలువురికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. చంద్రబాబు అసలు రంగు కుప్పం పర్యటనలో బయట పడిందన్నారు.

రక్తదానం

కాకినాడ క్రైం: కాకినాడ యువసేన స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలపై ఆకర్షితులైన సినీ ప్రముఖులు యువసేన బ్లడ్‌బ్యాంక్‌కు వచ్చి శనివారం రక్తదానం చేశారు. అశోకవనంలో అర్జున కళ్యాణం, రాజావారు రాణి గారు చిత్రాల దర్శకుడు రవికిరణ్ కోలా, పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించిన ప్రముఖ నటుడు కసిరెడ్డి రాజ్‌కుమార్ రక్తదానం చేసి యువతలో స్ఫూర్తినింపారు. ఈ సందర్భంగా సేవా మార్గంలో పయనిస్తున్న శ్రీయువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

భోగి మంట.. ఆనందం ఇంటింటా



ప్రత్తిపాడులో భోగిమంట వద్ద బ్రహ్మకుమారీల సందడి



ఒమ్మంగిలో హరిదాసుకు బియ్యం వేస్తున్న మహిళలు



గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురంలో భోగి మంట వెలిగిస్తున్న సినీతారలు

తుని/తునిరూరల్/ఏలేశ్వరం/గోకవరం/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/తొండంగి/శంఖవరం: భోగి పండగను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తెలవారుజామునే తలస్నానాలు చేసి తమ ఇళ్లు, రహదారుల ముఖ్యకూడళ్లలో కలప, దుంగలతో భోగిమంటలు వేశారు. పిల్లలు ఈ మంటల్లో ఆవు పిడకల దండలను వేశారు. చిన్నలు, పెద్దలు నూతనవస్త్రాలు ధరించి మంటల వద్ద గుమిగూడారు. సాయంత్రం మూడేళ్ల లోపు చిన్నారులకు భోగిపళ్లు వేసి వేడుకలు నిర్వహించారు. తుని గణపతినగర్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను క్లబ్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి వివరించారు. ఏలేశ్వరం పట్టణంతో పాటు మండల పరిధిలోని లింగంపర్తి, యర్రవరం, సిరిపురం, తిరుమాలి తదితర గ్రామాల్లో భారీ ఎత్తున భోగిమంటలు వేశారు. గోకవరం దేవీచౌక్ ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ భోగి మంట వేశారు. స్నానాల అనంతరం ఇంటిల్లపాది భోగి మంటల చుట్టూ చేరి సందడి చేశారు. చిన్నారులు భోగి మంటల్లో భోగి పిడకలు వేశారు. మహిళలు రంగవల్లులు వేసి వాటిపై గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం, ఉత్తరకంచి, శరభవరం గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో పెద్దపెద్ద దుంగలతో భోగి మంటలు వేశారు. తుని మండలంలోని ఎస్.అన్నవరం, ఎస్.సూరవరం, తేటగుంట, వి.కొత్తూరు, తొండంగి మండలంలోని దానవాయిపేట, ఏవీ నగరం, యర్రయ్యపేట గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎన్టీ రాజాపురంలో సినీ తారల సందడి

గండేపల్లి: మండలంలోని ఎన్టీ రాజాపురంలో శనివారం సినీ తారలు సందడి చేశారు. శివబాలాజీ, సమీర్, హేమ, జ్యోతి, కృష్ణుడు, జూనియర్ యాక్టర్స్ తదితరులు భోగి మంటలు వెలిగించి ఉత్సాహంగా గడిపారు. వీరిని చూసేందుకు స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా అభిమానులు తరలివచ్చారు. వీరి రాకతో పామాయిల్ తోటలో సినీ సందడి నెలకొంది. వీరికి వైఎస్సార్ సీపీ నాయకులు పరిమి బాబు, సుంకవిల్లి రమేష్, తదితరులు ఆతిథ్యం ఇచ్చారు.



ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో భోగి మంట వద్ద సందడి చేస్తున్న యువకులు



తుని పట్టణం గణపతినగర్‌లో భోగి మంట వెలిగించిన వాకర్స్ క్లబ్ సభ్యులు



ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో గంగిరెద్దుల సందడి

సందడే సందడి

- సంక్రాంతికి సర్వం సిద్ధం
- ముగ్గులతో కళకళలాడుతున్న ఇంటి వాకిళ్లు



ఏలేశ్వరంలో కిటకిటలాడుతున్న వస్త్రదుకాణం



ఏలేశ్వరంలో రద్దీగా ఉన్న రహదారులు

ఏలేశ్వరం/తుని: తెలుగువారి సంప్రదాయ పండగైన సంక్రాంతిని ఆదివారం ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యాయి. పల్లెల్లోని ప్రతిఇంటా కొత్త అల్లుల్లు, బంధువులతో సందడి నెలకొంది. మహిళలు ఇంటి ముందుట వాకిళ్లను ముగ్గులతో అందంగా అలంకరించారు. అల్లుళ్ల కోసం రకరకాల పిండివంటలు చేశారు. గ్రామాల్లో పలు రకాల పోటీలు నిర్వహించారు. పండగను పురస్కరించుకుని వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అధిక ధరలు చెల్లించి మరీ వస్త్రాలు కొనుగోలు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పట్టణం కళకళలాడింది.

గంగిరెద్దులు, హరిదాసుల సందడి

ప్రతి పల్లెలోనూ సంక్రాంతి సంప్రదాయాలైన గంగిరెద్దులు, హరిదాసుల సందడి నెలకొంది. గ్రామాల్లో గంగిరెద్దుల వారు ఇంటింటా తిరిగి బియ్యం, పప్పుదినుసులు వసూలు చేశారు. వీరికి కొత్తగా పెళ్లైన వారు పెళ్లికి కొనుగోలు చేసిన కర్పూర దండలతో పాటు వస్త్రాలు నగదు అందజేశారు. నెలరోజుల పాటు నగర సంకీర్తన చేసిన హరిదాసులు సంక్రాంతిని పురస్కరించుకుని బియ్యంతో పాటు కానుకలు స్వీకరించారు.

కిక్కిరిసిన రోడ్లు

పండగ సామాగ్రి కొనుగోలు చేసేందుకు ఏజెన్సీ గ్రామాల నుంచి గిరిజనులు భారీగా ఏలేశ్వరం తరలివచ్చారు. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసాయి. ఉదయం నుంచి నర్సీపట్నం రోడ్డు, మార్కెట్ రోడ్డు, యర్రవరం రోడ్లలో వాహనాల రద్దీ నెలకొంది.

పిండి వంటలు

సంక్రాంతి పండుగ రోజున పితృదేవతలకు పూజలు, నైవేద్యం సమర్పించేందుకు వివిధ రకాల పిండి వంటలను తయారు చేసేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభను వేదికలపై ప్రదర్శించే అవకాశాన్ని కల్పించారు.

తుని మార్కెట్లో రద్దీ

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వివిధ రకాల దుస్తులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో తుని మార్కెట్‌లో సందడి నెలకొంది. మెయిన్‌రోడ్డు, జీఎన్‌టీ రోడ్డు, బాలాజీ రోడ్డు, బెల్లపు వీధి, పెద్దవీధి, చిన్నవీధి, తదితర ప్రాంతాల్లో షాపులన్నీ కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

ధనుర్మాస ముగింపు వేడుకలు



కత్తిపూడిలో వేణుగోపాలస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో శనివారం ధనుర్మాస ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ కేలంగి నూకరాజు ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి గ్రామంలో భక్తి గీతాలతో ఊరేగించారు.

ఓంకార స్వామి జయంతి వేడుకలు రద్దు

ప్రత్తిపాడు రూరల్: వెంకటనగరం పంచాయతీ పరిధిలోని తోటపల్లి కొండల్లో ఉన్న శ్రీశాంతి ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీఓంకార స్వామి 129వ జయంతి వేడుకలను రద్దు చేసినట్లు ఆశ్రమ వర్గాలు శనివారం తెలిపాయి. గత మూడేళ్లుగా కరోనా వ్యాప్తి నేపథ్యంలో శ్రీఓంకార స్వామి జయంతి వేడుకలు నిర్వహించలేదు. ఈ ఏడాది కరోనా వైరస్ ప్రభావం లేనప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల జయంతి వేడుకలను రద్దు వేసినట్లు తెలిపారు. భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



తుని సంక్రాంతి సంబరాల్లో మహిళలు, చిన్నారుల సందడి



కిర్లంపూడిలో పొట్టేలు పోటీలు



గోకవరంలో సంప్రదాయ కోడి పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: సంక్రాంతి పండగను నియోజకవర్గ ప్రజలు సాంప్రదాయంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. గోకవరంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ కోడి పందేలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తెలుగు వారి పెద్ద పండగ అయిన సంక్రాంతిని ప్రజలంతా కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, నాయకులు దాసరి రమేష్, వరసాల ప్రసాద్, ముత్యాల శ్రీనివాస్, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, దాసరి సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు

తుని: పట్టణంలోని పేరూరి వారి వీధిలో శనివారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఐద్వా అధ్యక్షురాలు జి.అమ్మతల్లి ఆధ్వర్యంలో చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వేషధారణల్లో అలరించారు.

కిర్లంపూడి: సంక్రాంతిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో శనివారం కోడి పందేలతో పాటు పొట్టేలు, పందుల పోటీలు నిర్వహించారు. కాగా గుండాటపై పోలీసులు ఉక్కుపాదం మోపారు.



కిర్లంపూడిలో పందుల పోటీలు

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



వి.కొత్తూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సూర్యమణి



ఇర్రిపాకలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

తుని రూరల్: సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వి.కొత్తూరులో ముగ్గుల పోటీల విజేతలకు జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణలు బహుమతులు అందజేశారు. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పారుపల్లి పావని (పట్టు చీర), వనం మానస (టేబుల్ టాప్ గ్రైండర్), ఎ.అనంతలక్ష్మీ (మిక్సీ)లను గెలుపొందారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులను వైఎస్సార్ సీపీ నాయకుడు దుంగల నాగేశ్వరరావు, ఎంపీటీసీ కిల్లి సన్యాసిరావు, సూరెడ్డి లోవరాజు, హైస్కూల్ హెచ్ఎం వి.పద్మజ, రాణి అందజేశారు. తాళ్లూరులో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇర్రిపాకలో..

జగ్గంపేట: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని ఇర్రిపాకలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో గ్రామానికి చెందిన యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం మహిళలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జ్యోతుల ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు బహుమతులు అందచేశారు.

పి.నాయకంపల్లిలో...

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో సత్తమ్మతల్లి జాతర సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆలయ కమిటీ సభ్యుడు మలిరెడ్డి పాపారావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం



కిర్లంపూడిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

కిర్లంపూడి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వరస్వామికి శనివారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ పండితుడు గోవర్ధన శ్రీధర్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

అన్నసమారాధన

చిల్లంగి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

కన్నులపండువగా గోదాదేవి కల్యాణం



విశేషాలంకరణలో గోదాదేవి అమ్మవారు

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి గోదారంగనాథుల దివ్య కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదారంగనాథుల కల్యాణాన్ని తిలకించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఉదయం వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, నిత్య హోమం, పూర్ణాహుతి, పల్లకీ సేవ నిర్వహించారు.